# సాక్షి జగిత్యాల

మంగళవారం । 9 । మే । 2023






### తాగునీరు అందించాలి

జగిత్యాలజోన్: గణేశ్‌నగర్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆ కాలనీ రెసిడెన్సీ సభ్యులు అడిషనల్ కలెక్టర్‌కు విన్నవించారు.



### బదిలీలు చేపట్టాలి

జగిత్యాల: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని పీఆర్టీయూ నేతలు మంత్రి సబితకు విన్నవించారు.

గరిష్టం/కనిష్టం
37.0/27.0

### వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి

**జగిత్యాల:** ప్రజావాణి ద్వారా అందే ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అనేక వ్యయ ప్రయసాలకోర్చి ఇక్కడకు వస్తారని, అధికారులు వారి అర్జీలు స్వీకరించి సానుకూలంగా పరిష్కరించాలని అన్నారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా చూడాలని అన్నారు. ఈసందర్భంగా 40 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్లు లత, మకరంద్ పాల్గొన్నారు.

### ద్వంద్వ వైఖరి వీడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**జగిత్యాల:** సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన ద్వంద్వ వైఖరి వీడాలని, రాజకీయ లబ్ధికోసం ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హితవు పలికారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం సర్పంచులను కష్టనష్టాలకు గురిచేస్తోందని జీవన్‌రెడ్డి విమర్శించడం తగదన్నారు. కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల్లో జాప్యంతోనే సమస్య తలెత్తిందని వివరించారు. కేంద్రప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నించారు. కేవలం కేసీఆర్ టార్గెట్‌గా రాజకీయాలు చేస్తున్నారని, గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీతో కుమ్మక్కైన సంగతి ప్రజలందరికీ తెలుసు అన్నారు. నాయకుడు బాలముకుందం, సర్పంచులు చెరుకు జాన్, గంగాధర్, మహిపాల్‌రెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, సందీప్‌రావు పాల్గొన్నారు.

### బాండ్ పేపర్‌కు పిండప్రదానం



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

**మెట్‌పల్లి(కోరుట్ల):** కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు వంతెన నిర్మాణం కోసం గతంలో రాసిచ్చిన బాండ్‌పేపర్‌కు కొండ్రికర్ల గ్రామస్తులు సోమవారం పిండప్రదానం చేసి నిరసన తెలిపారు. ఎంపీటీసీ ఎన్నికల సమయంలో స్థానికులను కాదని వెల్లుల్ల గ్రామస్తుడిని ఎంపీటీసీగా గెలిపిస్తే కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బాండ్ పేపర్ రాసిచ్చారని గ్రామస్తులు గుర్తుచేశారు. ఎన్నికలు జరిగి నాలుగేళ్లు పూర్తయినా వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన నిర్మిస్తే వేములవాడకు ప్రయాణం మెరుగవుతుందని, వాగు అవతలి పొలాలకు వెళ్లే రైతులకూ మేలు జరుగుతుందని అన్నారు. అదే నమ్మకంతో విద్యాసాగర్‌రావును నమ్మి ఆయన సూచించిన వ్యక్తిని గెలిపించామని, కానీ, ఆయన తన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. సర్పంచ్ ఆకుల రాజగంగు, ఉపసర్పంచ్ గంట రాజేశ్వర్, గ్రామస్తులు మారు జనార్దన్‌రెడ్డి, అనిరెడ్డి ఆనంద్, రమేశ్, రాకేశ్, అశోక్, జలేందర్ పాల్గొన్నారు.

### అయ్యో బిడ్డా.. ఎంతపనైంది..



శివకార్తీక్ మృతదేహం

**జగిత్యాలక్రైం:** 'బిడ్డా పదేండ్ల తర్వాత వస్తిని.. మన కుటుంబాన్ని జూసి మురిసిపోతిని.. నీళ్ల కోసం వెళ్లి కానరానికి లోకానికి పోతవనుకోలే బిడ్డా' అని ఆ తండ్రి ఏడుస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. స్థానిక మహాలక్ష్మీనగర్‌కు చెందిన చౌటపల్లి శివకార్తీక్(12) మినరల్ వాటర్ కోసం తన ఇంటికి సుమారు 300 మీటర్ల దూరంలోని ప్లాంట్‌కు స్కూటీపై బయలు దేరాడు. మార్గమధ్యంలోని దేవిశ్రీ గార్డెన్ సమీప బైపాస్‌రోడ్డులో స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మోహన్ – పద్మ దంపతులు. వీరికి కూతురు వర్ష, కుమారుడు శివకార్తీక్. మోహన్ పదేళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లి.. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ వచ్చాడు. కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి జగిత్యాలలోని ఇంటికి తీసుకొచ్చారు. రోజంతా అందరూ సంతోషంగా గడిపారు. అయితే, మినరల్ వాటర్ కోసం శివకార్తీక్ రాత్రి వేళ స్కూటీపై ప్లాంట్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగి చనిపోయాడు. తాను వచ్చినరోజే కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# మితిమీరిన మిల్లర్ల దోపిడీ

- అరికడితేనే ధాన్యం కొనుగోళ్లు
- అప్పటిదాకా సేకరణ బంద్
- తేల్చిచెప్పిన విండో నిర్వాహకులు
- ఎమ్మెల్యే చెంతకు చేరిన వివాదం



వినతిపత్రం అందజేస్తున్న సింగిల్‌విండో చైర్మన్లు



జగిత్యాల సమీపంలోని చల్‌గల్ సింగిల్‌విండో కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

**జగిత్యాలఅగ్రికల్చర్:** ధాన్యం సేకరణలో మిల్లర్ల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. తప్ప, తాలు పేరిట భారీగా కోతలు విధిస్తున్నారు. రైతులే కాదు.. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి వాహనాల్లో తీసుకెళ్లిన వడ్లలోనూ కోత పెడుతున్నారు. తద్వారా నిర్వాహకులకు నష్టం జరుగుతోంది. దీనికి నిరసనగా జిల్లాలోని పలువురు సహకార సంఘాల అధ్యక్షులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లను కట్టడి చేయకుంటే వడ్లు కొనుగోలు చేయబోమని వారు హెచ్చరించారు. అంతేకాదు.. రైస్ మిల్లర్ల విషయంలో జోక్యం చేసుకుని వారి ఆగడాలు నియంత్రించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. అంతటితో ఆగకుండా జిల్లా సహకార సంఘాల ఉన్నతాధికారులకు కూడా సోమవారం వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు.

**సింగిల్‌విండోల పరిధిలో 275 కొనుగోలు కేంద్రాలు..**

- యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా మొత్తం 419 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- ఇందులో సహకార సంఘాల ఆధ్వర్యంలో 275 కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు.

### సహకార సంఘాల అధ్యక్షుల ఆగ్రహం

వరి పంటను హార్వెస్టర్‌తో కోసే సమయంలో.. అందులోని ఆధునిక ఫ్యాన్‌తో ధాన్యంలో తప్ప, తాలు గాలికి కొట్టుకుపోతుంది. కొనుగోలు కేంద్రంలోకి తీసుకెళ్లాక రైతులు మరోసారి ధాన్యం తూర్పార పడుతున్నారు. ఆ తర్వాత సహకార సంఘం సిబ్బంది వద్దలో తేమశాతం పరిశీలిస్తున్నారు. ఏఈవో ధ్రువీకరణ తర్వాత తూకం వేసి నాణ్యమైన వడ్లను రైస్‌మిల్లులకు లారీల్లో పంపిస్తున్నారు. అయినా, అక్కడ తప్ప, తాలు ఉందంటూ క్వింటాలుపై రెండు నుంచి మూడు కిలోలు కోత విధిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే ఇలా చేస్తున్నారని పలువురు రైతులు సహకార సంఘాల అధ్యక్షులను నిందించడం నిత్యకృతమైంది. కొన్నిచోట్ల రైస్‌మిల్లర్లు సహకార సంఘాల అధ్యక్షులకు ముడుపు ఇచ్చి ధాన్యంలో కోతలు విధించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

- ఆయా సంఘాల్లో రైతులు సభ్యులుగా ఉన్నారు. దీంతో వారు పండించిన ధాన్యాన్ని అధికంగా సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాలకే తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.
- నిబంధనల ప్రకారం తేమశాతం పరిశీలించి, తూకం వేసి, రైస్‌మిల్లులకు లారీల్లో పంపిస్తే.. ఆ వడ్లను రైస్ మిల్లర్లు అన్‌లోడ్ చేసుకోవడం లేదని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.
- తప్ప, తాలు వచ్చిందని, ధాన్యం నాణ్యంగా లేదని అనేక కొర్రీలు పెడుతున్నారు.
- ఈవిషయంలో సహకార సంఘాల అధ్యక్షులు, సీఈవోలు రైస్‌మిల్లర్లతో సంప్రదింపులతు జరిపినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
- అసలు సింగిల్‌విండో అధ్యక్షులు, సీఈవోల మాటలు కూడా పట్టించుకోవడంలేదు.
- కొందరు అధ్యక్షులు.. రైస్‌మిల్లర్లతో గొడవలకు దిగినా ప్రయోజనం లేకుండా పోతోంది.
- ఒక్కో క్వింటాలు వడ్లపై కనీసం రెండు కిలోలు కోతకు అంగీకరిస్తేనే రైస్‌మిల్లర్లు లారీల్లోంచి ధాన్యం అన్‌లోడ్ చేసుకుంటున్నారు.

**'విండో'ల అధ్యక్షుల సమావేశం..**

- రైస్‌మిల్లర్లు చేస్తున్న దోపిడీకి తాము రైతుల ఎదుట నిందితులుగా నిలబడాల్సి వస్తోందని భావించిన జిల్లాలోని పలువురు సహకార సంఘాల అధ్యక్షులు.. సోమవారం జిల్లా కేంద్రంలో సమావేశమయ్యారు. రైస్‌మిల్లర్ల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సహకార సంఘాల ఉన్నతాధికారులతోపాటు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఓ వినతిపత్రం అందజేశారు. రైస్‌మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను రక్షించాలని కోరారు. కొనుగోళ్ల ప్రారంభ దశలోనే మిల్లర్ల దోపిడీ ఇలా ఉంటే, చివరి వరకు ఎలా సాగుతుందోనని, రైతులతో ఇంకా ఎన్ని మాటలు పడాల్సి వస్తుందోనని సహకార సంఘాల అధ్యక్షులు ఆందోళన చెందుతున్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సహకార సంఘాల ఫోరం అధ్యక్షుడు రాజ సుమన్‌రావు, కేడీసీసీబీ జిల్లా సభ్యుడు రాంచందర్‌రావు, చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, రాజలింగం, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు. కాగా, సమస్యను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే సంజయ్.. ధాన్యం కోత విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈవిషయంపై ఇప్పటికే కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులతోనూ చర్చించామని తెలిపారు.

### దోపిడీ అరికడితేనే కొనుగోలు చేస్తాం



రైస్‌మిల్లర్ల దోపిడీ అరికట్టకపోతే రైతులు బతికే పరిస్థితి లేదు. సహకార సంఘాల అధ్యక్షులు దోపిడీ చేసినట్లు రైతులు నిందిస్తున్నారు. వారివద్ద మేం బద్నామ్ అవుతున్నాం. ప్రభుత్వం జోక్యం చేసుకుని ధాన్యంలో కోతలు కట్టడి చేయాలి. అలాగైతేనే ధాన్యం కొనుగోలు చేస్తాం. – పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు, జగిత్యాల

### మళ్లీ 'అకాలం'.. తడిసిన ధాన్యం



వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న వడ్లు

**సారంగాపూర్(జగిత్యాల):** పలు గ్రామాల్లో సోమవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన ధాన్యం తడిసిముద్దయ్యింది. నాలుగు రోజులుగా వర్షాలు తగ్గాయని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేసే సమయంలోనే ఒక్కసారికి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. నాయికపుగూడెంలో నీటిలో కొట్టుకుపోయింది. కొనుగోళ్లను వేగవంతం చేయకపోతే తాము మరింత నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతు

### 11న ఇంటర్వ్యూలు

**జగిత్యాల:** జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ‘డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్’లో వివిధ ఉద్యోగాల్లో నియామకాల కోసం ఈనెల 11న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ సోమవారం తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులకే సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. అభ్యర్థులు అన్ని జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

# మావోయిస్టుల కార్యకలాపాలు లేవు

- ఆ లేఖలు నకిలీవే
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- ఎస్పీ భాస్కర్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ భాస్కర్

**జగిత్యాలక్రైం:** జిల్లాలో నిషేధిత మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు లేవని ఎస్పీ భాస్కర్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులకు ఈనెల 6న నకిలీ లెటర్‌ప్యాడ్‌లు పోస్టు చేశారని అన్నారు. ఇందులో బాధ్యులైన ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. హెచ్చరిక లేఖలపై నర్సింహులపల్లి సర్పంచ్ ప్రభాకర్ ఫిర్యాదు చేయడంతో వాటిని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టామని అన్నారు. ఈక్రమంలో నర్సింహులపల్లికి చెందిన మాజీ మిలిటెంట్ బోగ లక్ష్మీరాజంపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. అయితే, తానే ఆ లేఖలు రాసినట్లు అతడు అంగీకరించాడని వివరించారు. లోతైన విచారణలో సిరిసిల్ల పట్టణంలోని వెంకట్రావ్‌నగర్‌కు చెందిన పోలు ప్రకాశ్.. తన కంప్యూటర్ ద్వారా మావోయిస్టుల పేరిట లెటర్‌ప్యాడ్‌లు ప్రింట్ చేసి లక్ష్మీరాజానికి ఇచ్చాడన్నారు. ఇదిలా ఉంటే.. లక్ష్మీరాజానికి, తన చిన్నబాపు కుమారుడు బోగ సత్తన్నతో కొంతకాలంగా భూ వివాదం నడుస్తోందని ఎస్పీ చెప్పారు. నర్సింహులపల్లికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కొందరు అధికారులు, గ్రామస్తులు కూడా సత్తన్నకే మద్దతు ఇవ్వడంతో మనసులో పెట్టుకున్న లక్ష్మీరాజం.. తన ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసేందుకు మావోయిస్టుల పేరిట లేఖలు ముద్రించి పోస్టు చేశాడని ఎస్పీ వెల్లడించారు. దీంతో లేఖలు పోస్టు చేసిన బోగ లక్ష్మీరాజం, వాటిని ముద్రించిన సిరిసిల్లకు చెందిన పోలు ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారినుంచి కంప్యూటర్, మానిటర్, ప్రింటర్, సీపీయూ, కలర్ ప్రింటర్, లేఖ రాసేందుకు ఉపయోగించిన కాగితాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. వరుసకు సోదరుడైన వ్యక్తితో ఉన్న వ్యక్తిగత కక్షలతోనే లక్ష్మీరాజం నకిలీ ఉత్తరాలు రాసి పోస్టు చేశాడని పేర్కొన్నారు. లక్ష్మీరాజం 50 లెటర్‌ప్యాడ్‌లు తీసుకుని, 30 లేఖలు రాసి ఆర్మూర్ పోస్ట్‌బాక్స్‌లో వేశాడని అన్నారు. అతడు పీపుల్స్‌వార్‌లో 1981 నుంచి 2000 సంవత్సరం వరకు పనిచేశాడని, 2008లో పోలీసులకు లొంగిపోయాడని చెప్పారు. కేసును ఛేదించిన రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, బీర్‌పూర్ ఎస్సై అజయ్, సారంగాపూర్ ఎస్సై మనోహర్‌రావు, కానిస్టేబుళ్లు రవి, జలేందర్, సుమన్‌ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాశ్, రూరల్ ఎస్సై అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# స్టాకు ఉన్నంత వరకు పాత ధరలే!

- ఐఎంఎల్ డిపోలో పూర్తయిన లేబులింగ్
- తగ్గిన లిక్కర్ ధరలు నేటి నుంచి విక్రయాలు
- నిమిషానికి 78 బీర్లు పీల్చేసిన పాత జిల్లా
- ఏడురోజుల్లో రూ.23 కోట్ల బీర్లు లేపిన మందుబాబులు



**సాక్షి ప్రతినిధి, కరీంనగర్:** 'రాజు వరమిచ్చినా.. మంత్రి అడ్డుకున్నట్లు'గా ఉంది మందుబాబుల పరిస్థితి. ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించినట్లు ప్రకటించి మూడురోజులు గడుస్తున్నా.. సరుకుపై ధరలు తగ్గించకపోవడంపై మందుబాబులు మండిపడుతున్నారు. దీనిపై వైన్‌షాపుల యజమానులు మాత్రం తమకు కొత్త స్టాకు వచ్చేంత వరకు పాతధరలే కొనసాగుతాయని చెబుతున్నారు. ఈనెల 5 నుంచి మద్యంపై ధరలను ప్రభుత్వం సవరించింది. ఫుల్‌బాటిల్‌పై రూ.40, హాఫ్ బాటిల్‌పై రూ.20, క్వార్టర్‌పై రూ.10 చొప్పున తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయని కూడా చెప్పింది. అయితే దీన్ని క్షేత్రస్థాయిలో మందుబాబులు తప్పుగా అర్థం చేసుకున్నారు. దీంతో శని, ఆది, సోమ వారాల్లో మద్యం ధరలు తగ్గాయి కదా? అంటూ వాగ్వాదానికి దిగుతున్నారు. వారికి సర్ది చెప్పడం ఎలాగో తెలియక వైన్‌షాపుల నిర్వాహకులు తల పట్టుకుంటున్నారు.

**దాదాపు పూర్తయిన లేబులింగ్..**

ప్రభుత్వం మద్యం ధరలను సవరించిన ప్రతీసారి ప్రభుత్వం కొత్త లేబులింగ్‌తో మద్యం సీసాలు విక్రయిస్తుంది. ఆదేశాలు వెలువడిన అనంతరం తక్షణమే అమలు కావాలి. కానీ అప్పటికే మద్యంషాపులు కొని తెచ్చుకున్న స్టాకు అలాగే ఉండిపోయింది. చాలాషాపుల్లో స్టాకు వారం పది రోజులకు ఒకసారి మారుస్తారు. పాత ధరలకు కొన్న రేట్లకే ఆ మద్యాన్ని అమ్ముకునే వీలుంది. ఎక్కువకు కొని తక్కువకు ఎవరూ విక్రయించరు కదా! ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ కూడా వీరికి పాత స్టాకును, పాత ధరలకు విక్రయించుకునేందుకు పచ్చజెండా ఊపింది. ఈలోపు ఐఎంఎల్ గోదాముల్లో ఉన్న లిక్కర్ స్టాకు లేబులింగ్ మార్చాల్సి వచ్చింది. పాత ధరలతో ఉన్న స్టాకుపై కొత్తగా సవరించిన ధరలను ముద్రించిన లేబుళ్లను వేస్తున్నారు. శని, ఆది, సోమవారాల్లోనూ ఈ ప్రక్రియ కొనసాగింది. మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ లోని వైన్‌షాపులకు వెళ్లే స్టాకుపై కొత్తగా ముద్రించిన లేబులింగ్ ప్రకారం మద్యం సీసాలు విక్రయించనున్నారు. ఈ వ్యవహారం తెలియని మందుబాబులు మాత్రం పాత ధరలకే మద్యం విక్రయిస్తున్నారంటూ యజమానులతో గొడవకు దిగుతున్నారు.

**పాత ధరలకు విక్రయిస్తే చర్యలు**

ధరల విషయంలో ఇప్పటికే పలువురు ఎక్సైజ్ అధికారులకు పలువురు మద్యం ప్రియులు ఫిర్యాదులు చేస్తున్నారు. పాత లేబుల్ ఉన్నవాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని పాత స్టాకు ఉన్నంత వరకు పాత ధరలు అమలవుతాయని, కొత్త లేబులింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత పాత ధరలతో విక్రయిస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**నిమిషానికి 78 బీర్లు..!**

వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో బీర్లకు డిమాండ్ పెరిగింది. మే మొదలైనప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లోని మందుబాబులు బీర్లను తెగతాగేశారు. మే 1 నుంచి 7వ తేదీల్లో రూ.23.17 కోట్ల విలువైన 65,961 కాటన్ల బీర్లు అమ్ముడుపోయాయి. కాటన్‌కు 12 బీర్లు చొప్పున మొత్తం 7,91,532 బీర్లు విక్రయించారు. ఈ లెక్కన రోజుకు 1,13,076 బీర్లు, ప్రతీ గంటకు 4,711, నిమిషానికి 78 చొప్పున బీర్లు తాగేశారు. వేసవి తాపానికి మద్యంప్రియులు అంతా బీర్లకు మారుతున్నారు. లిక్కర్ ధరలో మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం బీర్ల ధరల్లో ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. అయినా మందుబాబులు మాత్రం చల్లగా బీర్లను పీల్చేస్తున్నారు.

**వారంలో కరీంనగర్ ఐఎంఎల్ డిపోలో మద్యం విక్రయాలు**

| లిక్కర్ | విలువ |
| --- | --- |
| 13,901 పెట్టెలు | రూ.11.12 కోట్లు |
| **బీర్లు** | **విలువ** |
| 65,961 పెట్టెలు | రూ.23.17 కోట్లు |

(మే1 నుంచి 7 వరకు జరిగిన విక్రయాలు)

# 'పీఎంశ్రీ' జాబితాలో కోత

- 60 నుంచి 70 స్కూళ్లు ఎంపిక అవుతాయని ఆశించిన విద్యాభిమానులు
- ఎంపికైనవి కేవలం 15 మాత్రమే..



పీఎంశ్రీకి ఎంపికైన కోరుట్ల జెడ్పీ బాలికల స్కూల్

**కథలాపూర్(వేములవాడ):** మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం అమలు చేస్తోంది. ఇందులో కార్పొరేట్‌స్థాయి వసతులు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించింది. దీనిద్వారా సిలబస్, బోధన పద్ధతుల్లో మార్పులు చేయనుంది. అందుకు తగిన విధంగా మౌలిక వసతులు కల్పించాలనేది ఈ పథకం లక్ష్యం. అయితే, పీఎంశ్రీ పోర్టల్‌లో జిల్లాలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు.. 60 రకాల ప్రశ్నావళిని నమోదు చేసి ఫొటోలు, గ్రామపంచాయతీ, పాఠశాల తీర్మానం కాపీలను అప్‌లోడ్ చేశారు. ఇందులోంచి 15 స్కూళ్లనే పీఎంశ్రీకి ఎంపిక చేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాభిమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

**186 పాఠశాలల వివరాలు నమోదు..**

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా 380 గ్రామాలున్నాయి.
- వీటి పరిధిలో 511 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 187 జెడ్పీ హైస్కూళ్లు, 13 మోడల్ స్కూళ్లు మొత్తంగా 796 బడులు ఉన్నాయి.
- అయితే, రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు గతేడాది డిసెంబర్ 25 వరకు విధించిన గడువులోగా జిల్లాలోని 186 పాఠశాలల వివరాలను మాత్రమే ప్రధానోపాధ్యాయులు పీఎంశ్రీ పోర్టల్‌లో నమోదు చేశారు.
- ఇవన్నీ పథకంలో ఎంపికవుతాయని, అన్నీ సంపూర్ణంగా అభివృద్ధి చెందుతాయని అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషపడ్డారు.
- కానీ, ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రకటించిన జాబితాలో 15 పాఠశాలలనే ఎంపికచేసినట్లు వెల్లడించడంతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అసంతృప్తికి లోనయ్యారు.
- కనీసం 60 నుంచి 70 పాఠశాలలను తొలివిడతలో ఎంపిక చేస్తే బాగుండేదని విద్యాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

**జిల్లాలో ఎంపికైన పాఠశాలలు ఇవే..**

- పీఎంశ్రీకి 15 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో 8 మోడల్ స్కూళ్లు ఉండటం విశేషం.

**ఐదేళ్లలో సంపూర్ణ అభివృద్ధి**

- ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, ఆధుని క పద్ధతుల్లో బోధన, డిజిటల్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, స్వయం ఉపాధిని ఇచ్చే వృత్తి కోర్సులు, పౌష్టికాహారం అందేలా బడి తోట పెంచనున్నారు. ఈ పాఠశాలలను ఐదేళ్లలో సంపూర్ణ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**పీఎంశ్రీకి ఎంపికైన స్కూళ్ల వివరాలు**

| పాఠశాలలు | మోడల్ స్కూళ్లు |
| --- | --- |
| ఓల్డ్ హైస్కూల్(జగిత్యాల) | ధర్మపురి |
| జెడ్పీ హైస్కూల్(ధరూర్) | గొల్లపల్లి |
| జెడ్పీ హైస్కూల్(వెంకట్రావుపేట, మేడిపెల్లి) | జగిత్యాలరూరల్ |
| గురుకులం(పెద్దపూర్, మెట్‌పల్లి) | కోరుట్ల |
| జెడ్పీ హైస్కూల్(కోరుట్ల బాలికలు) | మల్యాల |
| జెడ్పీ హైస్కూల్(కోనాపూర్, సారంగాపూర్) | పెగడపల్లి |
| ఎంపీపీ స్కూల్(బీర్‌పూర్) | రాయికల్ |
| | వెల్గటూర్ |

### కార్పొరేట్ వసతులు



పీఎంశ్రీ కింద మా పాఠశాల ఎంపిక కావడం సంతోషంగా ఉంది. దీనికింద వచ్చే నిధులతో మౌలిక వసతులు సమకూరుతాయి. డిజిటల్ బోధన అందుబాటులోకి వస్తుంది. విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్య చేరువవుతుంది. సాంకేతిక విద్య, వృత్తి విద్య అందుతుంది.
– గడీల భూపతి, హెచ్‌ఎం, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కోరుట్ల

### ప్రాధాన్యం ఇవ్వాల్సింది



పీఎంశ్రీ పథకం ఉద్దేశం బాగుంది. కానీ, గ్రామీణ ప్రాంత పాఠశాలల అభివృద్ధికి తొలిప్రాధాన్యత ఇస్తే బాగుండేది. గ్రామాల్లోనే అక్షరాస్యత శాతం త క్కువగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. పాలకులు, అధికారులు విద్యాభివృద్ధి పథకాల్లో గ్రామాల గురించి పట్టించుకోకపోవడం దారుణం.
– పొలెపు బాలు, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్, పెగ్గెర్ల, కథలాపూర్

### వార్షిక ప్రణాళిక తయారీ



పీఎంశ్రీ కోసం ఎంపికైన 15 పాఠశాలల వార్షిక ప్రణాళిక తయారు చేసే పనుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. స్కూళ్లకు అవసరమైన బడ్జెట్‌పై నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం వరకు పనులు ప్రారంభమవుతాయి. మరోవిడతలో మరికొన్ని ఎంపికవుతాయి.
– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

## క్లుప్తంగా

### హైకోర్టు జడ్జిని కలిసిన ఎమ్మెల్యే



హైకోర్టు జడ్జి కార్తీక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల జోన్ : రాష్ట్ర హైకోర్టు జడ్జి పుల్ల కార్తీక్‌ను సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పోలీస్ గెస్ట్ హౌజ్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి పుల్ల కార్తీక్ స్వస్థలం జిల్లా కేంద్రం కావడంతో, పలు విషయాలపై చర్చించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, సబ్ జడ్జి ప్రసాద్ ఉన్నారు.

### పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



సంఘీభావం ప్రకటిస్తున్న జువ్వాడి కృష్ణారావు

ధర్మపురి: పంచాయతీ కార్యదర్శుల కృషితోనే రాష్ట్రానికి పరిశుభ్రత, పచ్చదనం వంటి అంశాల్లో పలు జాతీయ అవార్డులు వచ్చాయని, వారిని రెగ్యులరైజ్ చేయకపోవడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ధర్మపురి ఆలయ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిరవధిక సమ్మె చేస్తున్న కార్యదర్శులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 'విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు తొలగిస్తాం'

సారంగాపూర్: సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వెంటనే సమ్మె విరమించి మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు విధుల్లో చేరాలని, లేకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నోటీసులు జారీచేశారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరేముందు ప్రభుత్వానికి ఒప్పందపత్రం (అగ్రిమెంట్ బాండ్‌ను) ఇచ్చారన్నారు. క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేస్తుందని, ప్రభుత్వం కమిటీ నివేదిక ఆధారంగా రెగ్యులరైజ్ చేస్తుందని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి సమ్మె చేస్తున్నారని, వెంటనే విధుల్లో చేరాలని సూచించారు.

### బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



ఈరవ్వ మృతదేహం

గొల్లపల్లి: మండలంలోని గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన కొలకాని ఈరవ్వ (69) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి ఈరవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది తన ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గ్రామంలో వెతకగా వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### 'ఆలన' కార్యక్రమంపై శ్రద్ధ వహించాలి

సిరిసిల్లటౌన్: మంచానికే పరిమితమైన రోగుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆలన' కార్యక్రమంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు అన్నారు. సోమవారం జిల్లా వైద్యాధికారి ఆఫీసులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు.

# అర్హులకు 'ఆసరా' అందేదెప్పుడో?

- జిల్లాలో 2,28,480 లబ్ధిదారులు
- కొత్తగా 44వేల మంది దరఖాస్తులు
- 12వేల మంది ఎదురుచూపు
- త్వరగా మంజూరు చేయాలని విన్నపం..



కథలాపూర్‌లో పింఛన్ల గుర్తింపుకార్డుల పంపిణీకి హాజరైన లబ్ధిదారులు (ఫైల్)

కథలాపూర్ (వేములవాడ) : అర్హులైన పేదలకు ఆసరా పింఛన్ల మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా ఆచరణలో జాప్యం జరుగుతోందని పలువురు వాపోతున్నారు. వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వారు మృతిచెందితే మృతుడి భార్యకు 15 రోజుల్లో వితంతు పింఛన్ మంజూరు చేయాలని గత డిసెంబర్‌లో ప్రభుత్వం ప్రకటించింది. కానీ పలువురికి నెలలు గడిచినా కొత్త పింఛన్ మంజూరు కాకపోవడం, అధికారులను అడిగితే స్పందించడం లేదని చెబుతున్నారు. కొత్తగా బీడీ కార్మికులు, వృద్ధుల పింఛన్ల మంజూరు కావడం లేదని తెలుపుతున్నారు. జిల్లాలో 20 మండలాల్లోని 380 గ్రామాల్లో ఆసరా పింఛన్ లబ్ధిదారులు 2,28,480 మంది ఉండగా పింఛన్ల కోసం జిల్లాలో ప్రతినెలా రూ. 47.80 కోట్ల నిధులు కేటాయిస్తున్నారు.

**ప్రభుత్వ కార్యాలయా చుట్టూ ప్రదక్షిణ..**

కొత్తగా ఆసరా పింఛన్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకుందామంటే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు చెబుతుండటంతో పలువురు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారికి పింఛన్ మంజూరుకాకపోవడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. దీంతో బీడీ కార్మికులు, వృద్ధులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం చొరవ చూపి అర్హులకు ఆసరా పింఛన్లు అందేలా దరఖాస్తు ప్రక్రియ నెలనెలా చేపట్టాలని కోరుతున్నారు.

**జిల్లాలో 12 వేల మంది దరఖాస్తుదారులు**

జిల్లాలో 57 ఏళ్ల పైబడిన వారితోపాటు కొత్త పింఛన్ల కోసం గతేడాది ఆగస్టు వరకు సుమారు 44వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో జిల్లాలో కొత్తగా 31,557 ఆసరా పింఛన్లు మంజూరయ్యాయి. మిగతావారికి మంజూరు కాలేదు. జిల్లాలో సుమారుగా 12 వేల మంది దరఖాస్తుదారులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు తేలింది. వెబ్‌సైట్ ఓపెన్ అయితే దరఖాస్తుదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

| జిల్లాలో 2.28 లక్షల మంది లబ్ధిదారులు | |
|---|---|
| వృద్ధాప్య పింఛన్లు | 63,691 |
| వితంతు | 44,966 |
| వికలాంగులు | 17,405 |
| గీత కార్మికులు | 3,644 |
| చేనేత కార్మికులు | 2,510 |
| ఒంటరి మహిళలు | 4,623 |
| బీడీ కార్మికులు | 89,033 |
| కళాకారులు | 724 |
| బోధకాలు | 1,799 |
| డయాలసిస్ | 85 |

### రెండేళ్లుగా ఎదురుచూస్తున్నా



నా భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. వితంతు పింఛన్ మంజూరు చేయాలని పలుమార్లు దరఖాస్తు చేశా. రెండేళ్లుగా నిరీక్షిస్తున్నా పింఛన్ మంజూరు కాలేదు. వృద్ధాప్యంలో పనులు చేసుకుందామంటే ఆరోగ్యం సహకరించడం లేదు. ఆసరా పింఛన్ మంజూరయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలి.

– మామిడిపెల్లి గంగు, వితంతువు, భూషణరావుపేట, కథలాపూర్ మండలం

### త్వరగా పింఛన్ మంజూరుచేయాలి



రెండేళ్ల క్రితం నాభర్త కరోనాతో మృతిచెందాడు. బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నా. వితంతు పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశా. ఇప్పటికి పింఛన్ మంజూరుకాలేదు. పేదరికంలో ఉన్న తమకు అధికారులు పింఛన్ మంజూరు చేస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. తొందరగా పింఛన్ మంజూరుచేయాలి.

– లక్కాకుల బుచ్చమ్మ, వితంతువు, అంబారిపేట గ్రామం, కథలాపూర్ మండలం

### దరఖాస్తులను పరిశీలించాం



జనవరి నుంచి వితంతు పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాం. ఎప్పటికప్పుడు మంజూరయ్యేలా చొరవ తీసుకుంటున్నాం. మిగతా పింఛన్ల మంజూరు అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

– లక్ష్మీ నారాయణ, డీఆర్డీవో, జగిత్యాల

# నాలాంటి కడుపుకోత ఎవరికీ వద్దు

- కలెక్టర్‌కు ఓ తల్లి రోదనతో నివేదన

సిరిసిల్లటౌన్: 'కేటీఆర్ సార్.. ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి ప్రాణాలు పోగొట్టుకున్నాం. ఇటువంటి కడుపుకోత ఏ తల్లిదండ్రులకు రానివ్వద్దంటూ.. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈమేరకు కలెక్టర్ అనురాగ్‌జయంతి, డీఎంహెచ్‌వో సుమన్‌రావులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాలు.. ముస్తాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన కర్రోళ్ల జ్యోతి– రాజు దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు 7 సంవత్సరాలు, చిన్నకూతురు 5 నెలల వయస్సు. కొద్ది రోజుల క్రితం చిన్నపాప ఆరోగ్యం బాగా లేక వాంతులు అవుతుంటే సిరిసిల్ల పాతబస్టాండు సమీపంలోని ఓ పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఫిట్స్ వస్తున్నాయని తమ ఆస్పత్రికి అనుబంధమైన మరో ఆస్పత్రిలో అడ్మిట్ చేసి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. రోజులో నాలుగు సార్లు ఫిట్స్ వస్తున్నాయని పాపకు అధిక డోసులో మందులు ఇచ్చారని, దీంతో వైద్యులతో గొడవపడి హైదరాబాద్ తీసుకెళ్తుండగా పాప స్పర్శ కోల్పోయింది. హైదరాబాద్ ఆస్పత్రిలోని వైద్యులు పరీక్షలు చేసి మెదడువాపుగా గుర్తించి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. కాగా సిరిసిల్లలో అందిన వైద్యం వికటించడంతోనే పాప ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. ఈవిషయంలో న్యాయం జరుపాలని మంత్రిని కోరారు.

**ఎలాంటి విచారణకైనా సిద్ధం**

పాపకు జరిగిన హానిలో తమ పొరపాటు ఏమిలేదని చికిత్స అందించిన వైద్యుడు వివరించారు. పాపకు వాంతులని ఏప్రిల్ 26న తీసుకురాగా ఫిట్స్‌గా గుర్తించి ట్రీట్‌మెంట్ ఆరంభించాం. మావద్ద రికవరీ అవుతుందని చెప్పినా వినలేదు. హైదరాబాద్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుంటూ చనిపోయిందని తెలిసింది. ఐసీయూలో పాపను అబ్జర్వేషన్ కోసమే మా అనుబంధ ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందించాం. మావద్ద చికిత్సలో ఏలాంటి పొరపాటు జరుగలేదు. పాప తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణల్లో ఏలాంటి నిజం లేదు.

### గుర్తు తెలియని వాహనం ఢీ..

బోయినపల్లి (చొప్పదండి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు హనుమాన్ భక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన కీసర వెంకటేశ్, మామిడి సంపత్ పాదయాత్రగా వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్తున్నారు. కొదురుపాక గ్రామ సమీపం వద్ద వేములవాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కీసర వెంకటేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంపత్‌కు స్వల్ప గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఇద్దరిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

### పిడుగుపాటుతో ఎద్దు మృతి

కోనరావుపేట : మండలంలోని నిజామాబాద్‌లో పిడుగుపాటుతో ఎద్దు మృతిచెందింది. గ్రామానికి చెందిన నోముల తిరుపతి రెడ్డి అనే రైతు తన ఎద్దును పొలం వద్ద చెట్టుకు కట్టివేశాడు. సోమవారం వేకువజామున వెళ్లి చూసేసరికి మృతిచెంది ఉంది. పిడుగుపాటుకు మృతిచెంది ఉండవచ్చని, సుమారు రూ. 80 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

### ఫిట్స్‌తో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన గోనె వేణు (53) ఆదివారం రాత్రి ఫిట్స్‌తో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేణు కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. కొన్నిరోజుల నుంచి స్థానిక వృద్ధ సంరక్షణ కేంద్రంలో ఉంటున్నట్లు తెలిసింది. రాత్రి బయటకు వెళ్లగా ఫిట్స్ రావడంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చంద్రకళ, కుమారుడు ప్రదీప్, కూతురు రమ్య ఉండగా సిరిసిల్లలో నివాసముంటున్నారు. మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం సిరిసిల్లకు తరలించారు.

### యువకుడి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల గ్రామానికి చెందిన ఉల్లి మహేశ్ (26) అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాలు.. మహేశ్ రెండు రోజులుగా కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన సోదరుడు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 75696 95672, 94419 67358 నంబర్లకు ఫోన్ చేయాలని కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న దివ్యాంగుడు నరేశ్

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి వచ్చిన ముద్ద నారాయణ తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. నరేశ్ అనే దివ్యాంగుడికి దొరకడంతో సెల్‌ఫోన్‌ను తిరిగి నారాయణకు అప్పగించి పెద్దమనసు చాటుకున్నాడు.

# బందనకల్‌లో అకాల వర్షం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని బందనకల్, వెంకట్రావుపల్లెలో సోమవారం అకాల వర్షానికి ధాన్యం తడిసింది. ఒకవైపు ఎండలు ఉన్నాయనే భరోసాతో ధాన్యం ఆరబోశామని రైతు రామచంద్రారెడ్డి తెలిపారు. ఒక్కసారిగా భారీ వాన కురవడంతో కేంద్రంలో ధాన్యం తడిసిపోయిందని, కొంత కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ధాన్యం కొట్టుకుపోకుండా రైతులు తీవ్రంగా శ్రమించారు.

**ఈదురు గాలులకు విరిగిన చెట్లు**

బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాల పరిసరాల్లో సోమవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో ఓ చెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. స్తంభంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బోయినపల్లి సబ్‌స్టేషన్ లింక్ లైన్‌కు సంబంధించిన పోల్‌పై తుమ్మ చెట్టు విరిగి పడడంతో పోల్ మధ్యలోకి విరిగింది. ఈ క్రమంలో బోయినపల్లిలో చాలాసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగగా, సాయత్రం సరఫరా మెరుగైంది.

**గాలివాన బీభత్సం..**

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. దుమాలలో ఈదురుగాలులకు ఇళ్ల పైకప్పులు, రేకులు లేచిపోయాయి. గ్రామానికి చెందిన బైరి లక్ష్మయ్య ఇల్లు పూర్తిగా కూలిపోయింది. సల్మాల లచ్చయ్య, మల్లయ్య ఇళ్ల పై కప్పులు లేచిపోయాయి. సుమారు రెండుగంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో పంటలకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి



రాజు మృతదేహం

సిరిసిల్ల అర్బన్: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతిచెందిన సంఘటన సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు బాబాజీనగర్ కాలనీలో సోమవారం జరిగింది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లె గ్రామానికి చెందిన ములిగె రాజు (34) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే పెద్దూరు బాబాజీనగర్ కాలనీలో లింగం అనే వ్యక్తికి చెందిన భవనం నిర్మాణ పనికి కూలీగా వెళ్లాడు. రెండో అంతస్తులో సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ ఘటనలో రాజుకు తీవ్రగాయాలు కాగా స్థానికులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చిట్టి, కుమారుడు మనోజ్, కూతురు దీప్తిక ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### యువకుడి అరెస్ట్

మెట్‌పల్లి : పట్టణానికి చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో మండలంలోని మేడిపల్లికి చెందిన ఏనుగు వంశీకృష్ణను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మూడురోజుల క్రితం బాలికను కిడ్నాప్ చేయగా ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు బాలికను తల్లిదండ్రులకు అప్పగించగా వంశీకృష్ణను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



# సత్వర సేవలందించడమే లక్ష్యం

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాల క్రైం: ప్రజలకు సత్వర పోలీస్ సేవలందించడమే లక్ష్యమని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డేలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 32 మంది దరఖాస్తులను నేరుగా స్వీకరించారు. అర్జీ దారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. భూ సమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యలు, గల్ఫ్‌కు పంపిస్తామని మోసం చేసిన వారిపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కొడిమ్యాలకు చెందిన ఓ వ్యక్తి తొమ్మిది మందిని మలేషియాకు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన విషయంలో విచారణ జరిపి కేసు నమోదు చేయాలని మల్యాల సీఐ రమణమూర్తిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

# 6.25 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లత

జగిత్యాలఅగ్రికల్చర్: ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 6.25 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు అడిషనల్ కలెక్టర్ లత తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కొద్దిరోజుల పాటు కొనుగోళ్లలో స్తంభన నెలకొందన్నారు. ప్రస్తుతం వర్షసూచన లేకపోవడంతో రోజుకు సగటున 85 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని 5,810 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించామని అన్నారు. గతేడాది మే 7వ తేదీవరకు 78 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశామని, గత యాసంగితో పోల్చితే ప్రస్తుతం 10 రెట్లు ఎక్కువగా కొనుగోళ్లు సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు తగ్గినందున రైతులు ధాన్యాన్ని ఆరబోసి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తూకం వేయించాలని కోరారు. చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

# స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



సంజీవ్ (ఫైల్)



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న గోలి మోహన్

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని సిరికొండకు చెందిన దండిక సంజీవ్ (37) సౌదీ అరేబియాలో గతనెల 10న మృతిచెందగా సోమవారం రాత్రి మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సంజీవ్ ఎనిమిదేళ్లుగా సౌదీ అరేబియాకు వెళ్లొస్తున్నాడు. అక్కడ దమామ్ పట్టణంలో కార్మికుడిగా పనిచేసేవాడు. గతనెల 10న అక్కడ పనికి వెళ్లగా గుండెనొప్పి రావడంతో తోటివారు ఆస్పత్రికి తరలించేలోపు మృతిచెందాడు. సోమవారం మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య ఉమ, కూతురు సంజన, కుమారుడు అభిషేక్ ఉన్నారు. మృతదేహం వద్ద బీఆర్ఎస్ నియోజకవర్గ నేత గోలిమోహన్, సర్పంచ్ గాండ్ల వీణ, ఎంపీటీసీలు దొప్పల హైమావతి, బాదినేని రమేశ్, ఆకుల నర్సయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు.

# అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- స్తంభంపల్లిలో ఘటన
- మృతుడు నిజామాబాద్ జిల్లా వాసి
- ప్రేమ వ్యవహారమే కారణమా..?



రవితేజ (ఫైల్)



రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లిలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల వివరాలు.. నిజామాబాద్ జిల్లా జాక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లి హామ్లెట్ గాంధీనగర్ గ్రామానికి చెందిన అందె రవితేజ (23) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేస్తున్న సమయంలో ఫోన్ వచ్చింది. భోజనం అనంతరం వాహనంలో పడుకుంటా అని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో స్తంభంపల్లి గ్రామంలో తమ బంధువుల ఇంటికి రవితేజ వచ్చాడు. అక్కడ గేటు వేసి ఉండడంతో గేటు దూకి లోపలికి వెళ్లాడు. తలుపులు తీయాలని బాదడతంతో బంధువులు తీయలేదు. బంధువుల బయటకు వచ్చి చూడగా అతడు అప్పటికే నిప్పంటించుకున్నాడు. ఈ క్రమంలో 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మహేందర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రవితేజ మృతి విషయం అతడి తల్లి జ్యోతికి ఫోన్‌చేసి చెప్పారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా స్తంభంపల్లిలో ఘటన జరిగిన ఇంటి పరిసరాల్లో అక్కడ ఆరిన రక్తపు మరకలు ఉన్నాయని మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదులో పేర్కొంది. తన కుమారుడు రవితేజకు బంధువుల అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఉందని ఈ క్రమంలోనే తన కుమారున్ని కత్తితో పొడిచి హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, బంధువుల యువతి, ఆమె తల్లి, మేనమామ, అల్లుడి అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ బన్సీలాల్ సందర్శించారు.

**బంధువుల ఆందోళన**

సిరిసిల్లటౌన్: బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో మృతిచెందిన అల్లె రవితేజ బంధువులు సోమవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని రోడ్డుపై బైఠాయించారు. జిల్లాసుపత్రిలో పోస్టుమార్టం జరుగుతుండగా, ఈ కేసులో దోషులుగా ఆరోపిస్తూ సమీప బంధువులతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ వచ్చి రవితేజ బంధువులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# అభివృద్ధి పనులకు ఇసుక కొరత రానీయొద్దు

సిరిసిల్ల: జిల్లాలో అభివృద్ధి పనులకు ఇసుక కొరత రానీయొద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, భూగర్భ జలశాఖల అధికారులతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. వేములవాడ మూలవాగులో చెక్‌డ్యాం ముంపు ప్రాంతం నుంచి స్థానిక అవసరాలకు ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతించామని, ఎలాంటి యంత్రాలను వాడకుండా ఇసుకను స్థానిక అవసరాలకు తీసుకెళ్లవచ్చన్నారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్–మల్లుపల్లె మధ్యలో గల లోతు వాగుపై వేసిన ఇసుక మేటలతో బ్రిడ్జికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, పంట పొలాలు ముంపునకు గురి అవుతున్నాయని, ఆ ఇసుక మేటలను తొలగించేందుకు అనుమతి ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఇసుక సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే ఆర్డీవోలు సమీక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్‌కుమార్, డీపీవో రవీందర్, మైనింగ్ అధికారి సైదులు, భూగర్భ జలశాఖ అధికారి నర్సింహులు, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

జిల్లాలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాధాన్యత అంశాల అమలు తీరును పరిశీలించాలని, సమస్యలు ఉంటే తనకు నివేదించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు, 'మన ఊరు.. మన బడి' పనుల ప్రగతి తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించి తనకు నివేదించాలని కలెక్టర్ కోరారు.

### ప్రాజెక్టుతో నష్టం లేదు



మాట్లాడుతున్న ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి

జగిత్యాల: వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో స్థాపించనున్న ఇథనాల్ ప్రాజెక్ట్‌తో ప్రజలకు ఎలాంటి నష్టం లేదని, రాజకీయ లబ్ధికోసమే ప్రతిపక్ష నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు కోటిమంది రైతుల భాగస్వామ్యంతో క్రిభ్‌కో కంపెనీ.. 10 వేల సహకార సంఘాలను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోందన్నారు. ప్రాజెక్ట్‌ను జిల్లాకు తేవడంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ కృషి వెలకట్టలేనిదని తెలిపారు. ఇది సహించలేని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. నష్టాల గురించి చెప్పడానికి కాంగ్రెస్ నాయకులు జీవన్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సిద్ధమా? అని ఆయన సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నాయకులు రాజసుమన్‌రావు, మహిపాల్‌రెడ్డి, నరేశ్, వేణు, మల్లారెడ్డి, మధుసూదన్‌రావు, మాధవ్ పాల్గొన్నారు.